సౌత్ ఇండియన్ రెజ్లింగ్ పోటీల్లో హైదరాబాద్ వాసికి సిల్వర్ మెడల్

సిల్వర్ మెడల్ సాధించిన తోట సంకీర్తన్ యాదవ్

ఎల్బీనగర్, డిసెంబర్ 29: సౌత్ ఇండియన్ నేషనల్ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన తోట సంకీర్తన్ యాదవ్ సిల్వర్ మెడల్ సాధించి రెండో స్థానంలో నిలిచాడు. తెలంగాణ సీనియర్ రెజ్లింగ్‌లో 67 కేజీల గ్రీకో రోమన్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొన్న సంకీర్తన్ యాదవ్ జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటాడు. సిల్వర్ మెడల్ సాధించడంతో చైతన్యపురిలో అతడి స్నేహితులు, కుటుంబసభ్యులు, స్థానికులు సంబురాలు జరుపుకున్నారు. కాగా తోట సంకీర్తన్ యాదవ్ బీఆర్ఎస్ చైతన్యపురి డివిజన్ అధ్యక్షుడు తోట మహేశ్‌యాదవ్ కుమారుడు.

సావిత్రిబాయి ఉపాధ్యాయరత్న అవార్డులకు దరఖాస్తులు

చిక్కడపల్లి, డిసెంబర్ 29: సావిత్రిబాయిపూలే ఉపాధ్యాయ రత్న, స్వామి వివేకానంద నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్-2025కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టర్ తెలిపారు. జనవరి 3న సావిత్రిబాయి ఫూలేతోపాటు స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని అవార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. జనవరి 12న అందజేయనున్న ఈ అవార్డులకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ఉపాధ్యాయులు,కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారులకు సమాజ సేవకులు 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 96523 47207 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మురుగు.. పరుగు!

- మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రధాన రహదారులపై పారుతున్న మురుగు నీరు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

- తూతూ మంత్రంగా పారిశుధ్య పనులు
- వ్యర్థాలతో దుర్గంధం వ్యాప్తి
- విషజ్వరాలతో మంచాన పడుతున్న జనం

మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

బడంగ్‌పేట, డిసెంబర్ 29 : మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రహదారులపై నెలలుగా మురుగు నీరు పరుగులు పెడుతున్నది. వీఐపీలు నిత్యం ఇక్కడి రోడ్లపై ప్రయాణిస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దాంతో రోడ్లపై మురుగుతో పాటు ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయి కన్పిస్తున్నది. ప్రధానంగా శంషాబాద్ ఎయిర్ పోర్టు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం, టీసీఎస్, టాటా వంటి కంపెనీలకు వెళ్లే రహదారి పక్కనే నెలల తరబడి మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తూనే ఉన్నది. అయితే అధికారులు తూతూ మంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్నట్లు సర్వత్రా ఆరోపణలున్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని బాగా చేశామని గొప్పలు చెప్పుకోవడం తప్ప పనులు మాత్రం శూన్యమనే విమర్శలు విన వస్తున్నాయి. పారిశుధ్యంపై అవగాహన ర్యాలీలు ఏర్పాటు చేసినట్లు చెబుతున్నా ఎక్కడా స్వచ్ఛత కనిపించడంలేదని వివిధ కాలనీలవాసులు వాపోతున్నారు. ఈ విషయమై మీర్‌పేట మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్తాచెదారం

అంటువ్యాధుల బారిన జనం

మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో దుర్గంధం వ్యాపిస్తున్నది. దాంతోపాటు చెత్తా చెదారం, వ్యర్థాలతో అంటువ్యాధుల ప్రబలి జనం మంచం పడుతున్నారు. జ్వరాలతో దవాఖానల పాలవుతున్నారు. చికున్ గున్యా, డెంగీ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడుతున్నట్లు కాలనీవాసులు పేర్కొంటున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

మా దృష్టికి రాలేదు..

మురుగు నీరు రోడ్ల పై పారుతున్న విషయం మా దృష్టికి రాలేదు. గతంలో రెండు సార్లు జేసీబీతో రోడ్లపై చెత్తను తొలగించారు. ఓపెన్ నాలాకు ఎమైనా చెత్త అడ్డుకున్నదేమో పరిశీలిస్తాం. మురుగు నీరు రోడ్లపైకి వస్తే క్లీన్ చేయిస్తాం. అదేవిధంగా మురుగు రాకుండా చర్యలు తీసుకుంటాము.

– శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్

అయ్యప్ప స్వామికి మాజీ మంత్రి పూజలు

పెండ్యాలలో అయ్యప్ప పూజలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, డిసెంబర్ 29 : మహేశ్వరం మండలం పెండ్యాల గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద ఆదివారం అయ్యప్ప స్వామి మహాపడి పూజ నిర్వహించారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పీ. సబితాఇంద్రారెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అయ్యప్ప కృపతో ప్రజలంతా సుఖ శాంతులతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఇమామ్‌గూడలో జస్ట్ బేకరీని ఆమె ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ జట్టు ఎంపిక



ట్రయల్స్ జట్టుకు ఎంపికైన విద్యార్థులతో మర్రి లక్ష్మణ్‌రెడ్డి

దుండిగల్, డిసెంబర్ 29 : అరుంధతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఏయిమ్స్) క్రికెట్ గ్రౌండ్‌లో సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ ఎంపిక ట్రయల్స్ ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ అనుబంధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. సెలక్షన్ ట్రయల్స్ విశ్వవిద్యాలయ క్రికెట్ జట్టు ఏర్పాటులో ముగిశాయి. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఏయిమ్స్ చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి హాజరయ్యారు. ట్రయల్స్ విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని, ఏయిమ్స్ విద్యార్థులు ఎంపిక కావడం ఆనందంగా ఉందని ఏయిమ్స్ ఫౌండర్ సెక్రటరీ మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏయిమ్స్ డైరెక్టర్ మర్రి ధీరెన్‌రెడ్డి, డీన్ ఉదయ్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ డా.వెంకట్ పాల్గొన్నారు.

రాజా బహదుర్ వెంకట్ రామ్‌రెడ్డి హాస్టల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అబిడ్స్, డిసెంబర్ 29 : రాజా బహదుర్ వెంకట్‌రామ్ రెడ్డి హాస్టల్ 106 సంవత్సరాల చరిత్ర కలిగిన విద్యా సంస్థ. ఈ సంస్థ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం అబిడ్స్‌లోని రెడ్డి కళాశాలలో నిర్వహించారు. సుమారు 1200 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థి తెలంగాణ ఆర్ అండ్ బీ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజా బహదుర్ వెంకట్‌రామ్ రెడ్డి గొప్ప సంస్కర్త అని, అసమాన ప్రతిభ కలిగిన పోలీస్ అధికారి కొనియాడారు. కులమతాలకతీతంగా ఎన్నో విద్యాలయాలకు సహాయ సహకారాలు అందించిన విద్యా దాత అని పేర్కొన్నారు. సమస్త రాష్ట్రాన్ని తన స్వంత కుటుంబంలా భావించిన మహా మనిషి అని అన్నారు. సమ్మేళనంలో పాల్గొన్న వారిలో జి. చిన్నారెడ్డి, ఎంపీ జితేందర్‌రెడ్డి, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, పటేల్ రమేశ్‌రెడ్డి, సుధీర్ రెడ్డి, జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

పబ్‌లు తనిఖీ చేసిన పోలీసులు

కుత్బుల్లాపూర్ :నూతన సంవత్సర నేపథ్యంలో తనిఖీలు చేపడుతున్నట్టు పేట్‌బషీరాబాద్ సీఐ విజయ్‌వర్ధన్ తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు పబ్‌లు, అనుమానాస్పద వ్యక్తులను ఆదివారం పరిశీలించారు. పబ్‌ల నిర్వహణ, లైసెన్స్‌లు పరిశీలించారు. కొందరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వివరాలు సేకరించారు. కార్యక్రమంలో మేడ్చల్ ఎస్ఓటీ సిబ్బంది, పేట్‌బషీరాబాద్ పోలీసులు పాల్గొన్నారు.

మాదాపూర్‌లో...

మాదాపూర్ : నూతన సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకొని మాదాపూర్ పోలీసులు శనివారం అర్ధరాత్రి పలు చోట్ల బార్లు, పబ్‌లపై తనిఖీలు చేపట్టారు. మాదాపూర్ ఇన్స్పెక్టర్ కృష్ణ మోహన్ ఆధ్వర్యంలో సిబ్బందితో పాటు ఎక్సైజ్ సిబ్బందితో కలిసి 10 పబ్‌లను తనిఖీ చేశారు. 16 మంది అనుమానితులను అదుపులోకి తీసుకొని పరీక్షలు చేయగా నెగిటివ్‌గా తేలింది. తనిఖీల్లో ఎస్ ఓటీ ఇన్స్పెక్టర్, సిబ్బంది, డాగ్ స్క్వాడ్స్, ఎక్సైజ్ ఎస్సై, టీఎస్ నాబ్ ఇన్స్పెక్టర్, మాదాపూర్ సిబ్బంది పాల్గొన్నారు.

దేవరయంజాల్‌లో ఆధ్యాత్మిక గ్రంథాలపై ప్రచారం

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 29: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందు జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు స్వామి రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను దేవరయంజాల్‌లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. షామీర్‌పేట్ మండలం దేవరాయంజాల్‌లో త్రైతసిద్ధాంత-ప్రబోధ సేవా సమితి ఇందు జ్ఞాన వేదిక హైద్రాబాద్ కమిటీ ఆధ్వర్యంలో గ్రంధాల విశిష్టతను ప్రచారం చేసి ప్రజలకు వివరించారు. కమిటీ అధ్యక్షుడు గిరి, సభ్యులు పాల్గొన్నారు.

డ్రగ్స్ సరఫరా చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు తదితరులు

కాచిగూడ,డిసెంబర్ 29 : నూతన సంవత్సర వేడుకల ముసుగులో యువతి, యువకులను టార్గెట్ చేస్తూ డ్రగ్స్ సరఫరా చేస్తున్న వ్యక్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్ లక్ష్మణ్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇరత రాష్ట్రాల నుంచి రాత్రి సమయంలో దొంగచాటుగా ఆక్రమంగా డ్రగ్స్ సరఫరా చేస్తున్నారని, వారిపై ప్రభుత్వం గట్టి నిఘా చేట్టాలని పేర్కొన్నారు. సునీల్‌కుమార్, ప్రియాచారి, సంజయ్‌కుమార్, కె. రాఘవ, శ్రీనివాస్‌గుప్త, అభినయ్ తివారీ, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వంజరి కులస్తుల సంక్షేమానికి కృషి

గోల్నాక : సామాజికంగా, ఆర్థికంగా ఎంతో వెనుకబడి ఉన్న వంజరి కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తానని అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం అంబర్‌పేట డివిజన్ న్యూపటేల్‌నగర్ కమ్యూనిటీ హాల్లో అంబర్‌పేట వంజరి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆ సంఘం రాష్ట్ర ప్రతినిధి కరిపె జగన్ మోహన్‌రావు, అంబర్ పేట వంజరి సంఘం అధ్యక్షుడు లవంగు ఆంజనేయులుతో కలసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై...ఆ సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు డొరె గంగరాజు, వారె బాలకృష్ణ, వంజరి నాగరాజు, భూమన్న, కరిపె చంద్రశేఖర్, విఠల్, రాజశేఖర్, ఎదుగని అశోక్, ఎంకే రాజు, లవంగు నాగరాజు, శంకర్, కాళిదాస్, సాటికె రాజు, పోత్నక్ ప్రకాశ్, పి.శ్రీనివాస్, లక్ష్మణ్, నరేశ్, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధే లక్ష్యం : కార్పొరేటర్

బోర్‌డ్రిల్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ హేమలత

జీడిమెట్ల, డిసెంబర్ 29 : కాలనీల అభివృద్ధే తన లక్ష్యమని సుభాష్‌నగర్ కార్పొరేటర్ జి.హేమలత సురేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూరారం కాలనీలో రూ.11 లక్షలతో బోర్‌డ్రిల్‌ను కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. కాలనీల అభివృద్ధితో పాటు పార్కులను ప్రజలకు అందుబాటులోకి తీసుకవస్తానన్నారు. ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సహకారంతో పార్కు, వాకింగ్ ట్రాక్, బోర్ డ్రిల్ పనులకు జీహెచ్ఎంసీ నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ ప్రధాన కార్యదర్శి శివాజీ, సీనియర్ నాయకులు పందిరి యాదగిరి, మహిళా అధ్యక్షురాలు మంగ, ప్రధాన కార్యదర్శి పద్మావతి, వరలక్ష్మి, స్థానిక నాయకులు వెంకటేశ్వర్లు, సాయి, కృష్ణారెడ్డి, మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజుగౌడ్, పాల్గొన్నారు.

అనసూయ.. చారిటబుల్ ట్రస్ట్ కార్యవర్గం

ట్రస్ట్ సభ్యులతో మేనేజింగ్ ట్రస్టీ కాసుల మల్లికార్జున్

కాచిగూడ, డిసెంబర్ 29: కాసుల అనసూయ వెంకటేశం చారిటబుల్ ట్రస్ట్‌కు నూతనంగా 14 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీగా కాసుల మల్లికార్జున్, ట్రస్టీలుగా కాసుల విజయభారతి, కాసుల వినోద్, కాసుల రమణ, కాసుల చందు, కాసుల సతీశ్‌కుమార్, నర్రా దేవేందర్, నర్రా సాయికిరణ్, నర్రా సాయికిశోర్, కాసుల శ్వేత, కాసుల స్రవంతి,కాసుల స్వాతి, కాసుల లక్ష్మీప్రియా, కాసులు వందన ఆదివారం మేనేజింగ్ ట్రస్టీ కాసుల మల్లికార్జున్ ఆధ్వర్యంలో కాచిగూడ మున్నూరుకాపు సంఘంలో ఎన్నుకున్నారు. అనంతరం 14 మంది ట్రస్టీ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి సహాయ, సహకారాలు అందించేందుకు ఈ ట్రస్టీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఛేదించాలి

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 29: విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించేందుకు కష్టపడి చదవాలని రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షులు ఎం.ప్రభాకరాచారి, ప్రధాన కార్యదర్శి జి.శ్రావణ్‌కుమార్‌లు అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో అత్తాపూర్‌లోని హైదరాబాద్ స్కాట్స్ హై స్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. మండలంలోని వెయ్యి మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలతో.. సృజనాత్మకత

దుండిగల్, డిసెంబర్ 29 : ముగ్గుల పోటీలతో సృజనాత్మకత వెలుగులోకి వస్తుందని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధి, 4వ డివిజన్ ప్రగతినగర్‌లో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీకు మేయర్ నీలాగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, విజేతలకు మేయర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సుబ్బు, చంద్రశేఖర్, శివకుమార్, మహమ్మద్, మహేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రావు, చంద్రశేఖర్, ప్రతాప్‌రెడ్డి, అంజద్, ఆంజనేయవర్మ, భాస్కర్, శ్రీధర్, స్థానికులు పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

శేరిలింగంపల్లి : ప్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో 35 కాలనీల్లోని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని ప్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అన్నారు. ఆదివారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నేతాజీ నగర్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు.

రతన్‌టాటా ఎక్సలెన్సీ అవార్డుల ప్రదానం

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 29: రతన్ టాటా స్వయం కృషితో ఎదిగి పారిశ్రామిక రంగంలో అగ్రగామిగా నిలవడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ఎందరికో మార్గదర్శకంగా నిలిచారని వక్తలు అన్నారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆబిడ్స్ తిలక్ రోడ్డు బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్‌టాటా 86వ జయంతి సందర్భంగా పలువురు బిజినెస్ మేనేజ్‌మెంట్ రంగంలో సేవలందిస్తున్న పలువురు ప్రొఫెసర్లకు రతన్‌టాటా ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానం చేసి సత్కరించారు. కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రతన్‌టాటా జీవిత చరిత్రపై నగరంలోని పలు ఎంబీఏ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు, సర్టిఫికెట్‌లను అందజేశారు. తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికల పురుషోత్తం, ఉన్నతవిద్యాశాఖ కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ పాల్గొని రతన్‌టాటా జీవిత విశేషాలను వివరించారు. ప్రముఖ ఇంద్రజాలికుడు డాక్టర్ ఎల్.ఎన్. రాజు నిర్వహించిన మ్యాజిక్ షో అలరించింది. కౌన్సిల్ కార్యదర్శి ఇట్టా ఉదయశ్రీ, ప్రోగ్రాం చీఫ్ కో ఆర్డినేటర్ డాక్టర్ రవి తేజ. మేఘన, మీనాక్షి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 29: తమతో పాటు చదువుకున్న మిత్రుడు మృతి చెందటంతో తోటి మిత్రులు ఆ కుటుంబానికి అండగా నిలిచి ఆదుకున్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎదులాబాద్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1995-96 బ్యాచ్‌కు చెందిన కామరాజు హన్మంత్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థి మిత్రులు అతని కుటుంబానికి రూ.35 వేల నగదును ఆదివారం అందజేశారు.

ప్రజల పక్షాన పోరాడే పార్టీ.. సీపీఐ

ఆర్కేపురం: సరూర్‌నగర్ కార్యాలయంలో సీపీఐ జెండాను ఎగరవేస్తున్న జంగయ్య, తదితరులు

ఆర్కేపురం, డిసెంబర్ 29 : భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల ఆవిర్భావ వేడుకలను ఆదివారం సరూర్‌నగర్ మండల కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సీపీఐ సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నరసింహ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య హాజరై అరుణ పతాకాన్ని ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల పక్షాన పోరాడే పార్టీ సీపీఐ అన్నారు. 1925లో పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు తెలంగాణలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూస్వాములపై పోరాడిందన్నారు. ఫలితంగా పది లక్షల ఎకరాలను పేదలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, నర్సిరెడ్డి, కరుణాచారి, శ్రీనివాస్, లింగస్వామి, శోభ, అనిత, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ఎల్బీనగర్ : భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల పోస్టర్‌ను ఆదివారం కొత్తపేట డివిజన్ న్యూ నాగోల్‌లోని ఎస్ఏ డాంగే భవనంలో ఆ పార్టీ కార్యదర్శి మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. సీపీఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నల్లగొండలో నిర్వహించే బహిరంగ సభకు కార్యకర్తలంతా హాజరై జయప్రదం చేయాలన్నారు.



ఎల్బీనగర్ : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు మల్లేశ్, బషీర్, రాజేందర్ తదితరులు

కార్యక్రమంలో సీపీఐ జైపురికాలనీ కార్యదర్శి ఎండీ బషీర్, ఉప్పల్ మండల కౌన్సిల్ సభ్యులు రాసమల్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత ఐక్యవేదిక యువజన కమిటీ ఉపాధ్యక్షుడిగా క్రాంతికుమార్

హయత్‌నగర్, డిసెంబర్ 29 : తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జిగా హయత్‌నగర్‌కు చెందిన బెలిదే క్రాంతికుమార్ నేత నియామకమయ్యారు. అందె జ్యోతీగణేశ్ సహకారంతో తెలంగాణ చేనేత ఐక్యవేదిక నూతన అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ నేత క్రాంతికుమార్ నేతకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బెలిదె క్రాంతి మాట్లాడుతూ.. నేతన్నల అభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తానన్నారు. తనకు పదవీ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆర్కేపురం, డిసెంబర్ 29 : పలు విద్యుత్ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు సరూర్‌నగర్ డీఈ కేకే రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందూ అరణ్య విల్లాస్ ఫీడర్ పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు, తట్టిఅన్నారం పరిధిలో తట్టిఅన్నారం, ఆర్కే నగర్, వనస్థలి హిల్స్, కుత్బుల్లాపూర్, తిమ్మాయిగూడ, మర్రిపల్లి, దేశ్‌ముఖ్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు దేశ్‌ముఖ్ కాలనీ, రామకృష్ణపురం, ముదిరాజ్ కాలనీ, ఛత్రపతి శివాజీ కాలనీ, రాఘవేంద్ర కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు రాఘవేంద్ర నగర్, అరుణోదయకాలనీ, భాగ్యలత, హైకోర్టు కాలనీ, మదర్‌డైరీ ఫీడర్ పరిధిలో డీర్‌పార్కు,బాలాజీనగర్, ఎల్లారెడ్డికాలనీ, వినాయకనగర్, కొత్తపేట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు కొత్తపేట్ విలేజ్, న్యూ మారుతీనగర్ ఫీడర్ పరిధిలో మారుతీనగర్ రోడ్డు నంబర్-1,2, న్యూ మారుతినగర్, ప్రభుత్వ పాఠశాల ఏరియా, రాక్‌హిల్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు రాక్‌హిల్స్, రాక్‌టౌన్, విశాలాంధ్ర ఏరియా, వి.గార్డ్ ఫీడర్ పరిధిలో వాంబే కాలనీ, మన్సూరాబాద్, విశాలాంధ్ర, రాక్‌టౌన్, బిగ్‌బజార్, బాలాజీనగర్, సాయినగర్ కాలనీ ఫీడర్ పరిధిలో చాణిక్యపురి కాలనీ, సాయినగర్ రోడ్ బండర్- 1,2 ఏరియా, గోటేటి ఫంక్షన్‌హాల్ పరిదిలో రాక్‌టౌన్ కాలనీ రోడ్ నంబర్-1,2,3, సాయినగర్, లలితనగర్, శ్రీనివాస కాలనీ ఫీడర్ పరిధిలో శ్రీనివాసకాలనీ, వెంకటేశ్వర కాలనీ, కల్వంచ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కల్వంచ, శాంతినగర్, శారదనగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

చంపాపేట సెక్షన్ పరిధిలో..

సైదాబాద్ : లక్ష్మీనగర్ సబ్‌స్టేషన్(చంపాపేట సెక్షన్) పరిధిలో 33/11కేవీ లైన్ల మరమ్మతు పనుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్